క్లుప్తంగా

కనకదుర్గ ఆలయంలో ఘనంగా హోమం



ఓల్డ్ బోయిన్‌పల్లి: అమావాస్యను పురస్కరించుకుని బోయిన్‌పల్లి రిటైల్ కూరగాయల మార్కెట్‌లోని కనకదుర్గమ్మ ఆలయంలో శుక్రవారం హోమాలు, పూజలు చేశారు. ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. రిటైల్ కూరగాయల మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యనారాయణ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

సీనియర్ సిటిజన్‌లకు సన్మానం



సీనియర్ సిటిజన్ సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్

ఓల్డ్‌బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ పీవీ ఎన్‌క్లేవ్, సమతానగర్‌లోని స్నేహ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్ పుట్టిన రోజు, వివాహ వార్షిక వేడుకలను శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ హాజరై కేక్ కట్ చేయించారు. అనంతరం పలువురిని సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే యాదిరెడ్డి, సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు శ్యాంసుందర్‌రావు, జనరల్ సెక్రటరీ సూర్యప్రకాశ్, సెక్రటరీ సుధాకర్‌రావు, సత్తయ్య, సభ్యులు మోహన్‌రెడ్డి, నాగేశ్వర్ రావు, ఎం. విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



మూసాపేట: మూసాపేట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమావాస్య సందర్భంగా అన్నదానాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్ హాజరయ్యారు. కార్యక్రమంలో అన్నదాన కమిటీ చైర్మన్ నేతి రాములు గుప్తా, చంద్రశేఖర్ గుప్తా, శ్రీనివాస్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌లో విస్తృత పరిశోధనలు జరగాలి

హెచ్‌సీయూ భౌతికశాస్త్రం ప్రొ.వెంకటయ్య

రాయదుర్గం: భారతదేశ అభివృద్ధికి నూతన ఆవిష్కరణలు ఎంతో అవసరం అని, సైన్స్ అనేది ప్రగతికి ఆనవాలు కావున మరిన్ని పరిశోధనలు చేయాల్సిన అవసరం ఉందని హెచ్‌సీయూ భౌతికశాస్త్రం ప్రొఫెసర్ జి వెంకటయ్య అభిప్రాయ పడ్డారు. గచ్చిబౌలి డివిజన్‌లోని గోపన్‌పల్లిలో జవహర్ నవోదయ విద్యాలయంలో శుక్రవారం ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'జాతీయ విజ్ఞాన శాస్త్ర దినోత్సవం (సైన్స్‌డే)ను నిర్వహించారు. ఈ సందర్భంగా సీవీరామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతీయ యువతకు సాధికారత కల్పించడం అవసరమని అన్నారు. అసోసియేషన్ కన్వీనర్ టి రామస్వామియాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జేఎన్‌వి ప్రిన్సిపల్ డి విజయ భాస్కర్, వైస్ ప్రిన్సిపల్ ఎంఎస్ మిత్రి, టీచర్లు శ్రీనివాసరావు, రామచంద్రు,ఎం చౌదరి, ఆదినారాయణరెడ్డి. ప్రసన్నకుమార్, ఈపీటీఆర్ఐ సభ్యులు, జేఎన్‌వి విద్యార్థులు, అసోసియేషన్ సభ్యులు అమ్మయ్యచౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

కేపీహెచ్‌బీ కాలనీ : ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఓ మహిళ సీలింగ్ ఫ్యాన్కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం ఆరవ ఫేజ్‌లో నివాసం ఉండే సునీల్, పూజ శ్రీలు భార్యాభర్తలు. పూజశ్రీ ప్రైవేట్ ఉద్యోగం చేస్తుంది. శుక్రవారం బెడ్రూమ్‌లో సీలింగ్ ఫ్యాన్కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. భర్త సునీల్ వచ్చి తలుపు కొట్టడంతో తలుపు తీయలేదు. దీంతో మరో గది నుంచి తలుపులు తెరిచి చూడగా.. ఫ్యాన్ కు ఉరేసుకొని కనిపించింది. దీంతో వెంటనే పూజ శ్రీ సోదరి సౌమ్యశ్రీకి ఫోన్ చేసి సమాచారం ఇవ్వగా.. ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీలత తెలిపారు.

పార్కులో అన్నీ సమస్యలే..

పార్కులనగానే పచ్చదనం, ఆహ్లాదం గుర్తొస్తుంది. చిన్నారులు ఆడుతూ సందడి చేస్తారు. పచ్చని చెట్ల కింద సేదా తీరేందుకు ఎందరో వస్తుంటారు. ఆహ్లాదం, వినోదం పంచే పార్కు సమస్యలతో తల్లడిల్లుతుంది. ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ హెచ్ఏఎల్ కాలనీ పార్కులో అన్నీ సమస్యలే. కనీసం తాగడానికి కూడా నీటి సౌకర్యం లేదు. మూత్రశాలలు కంపు కొడుతున్నాయి. పార్కు సమస్యలతో కొట్టుమిట్టాడుతుంది. ఆట వస్తువులు మరమ్మతులకు నోచుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా అధికారులు పార్కులో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని స్థానికులు వేడుకుంటున్నారు.



హెచ్ఏఎల్ పార్కు ప్రధాన ద్వారం



నిరుపయోగంగా మారిన పార్కులోని పిల్లల ఆట వస్తువులు



మోటారు లేక బోరు పైపులను తొలగించి చెత్తలో పడేసిన దృశ్యం

ఓల్డ్‌బోయిన్‌పల్లి : 1974లో హుడా లే అవుట్ ప్రకారం హెచ్ఏఎల్ కాలనీ ఏర్పడినప్పుడు కాలనీ వాసుల కోసం 3708 గజాల స్థలాన్ని పార్కు కోసం కేటాయించారు. 2002లో కూకట్‌పల్లి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పార్కు అభివృద్ధికి బీజం పడింది. పార్కు చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేసి మొక్కలు నాటారు. మూడేళ్ల క్రితం ఓపెన్ జిమ్, పిల్లల ఆట వస్తువులు ఏర్పాటు చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. ఇప్పుడు పార్కు అధ్వానంగా మారింది. హెచ్ఏఎల్ కాలనీలోని పార్కులో పూల మొక్కలు ఉన్నప్పటికి పచ్చదనం కరువైంది. పార్కులోని మొక్కలకైనా నీరు అందించే పరిస్థితి లేదు. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతుందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆట వస్తువులు ధ్వంసం

- చెత్తా చెదారాలకు నిలయంగా పార్కు
- పట్టించుకోని అధికారులు

చెత్తాచెదారంతో..

పార్కు లోపల ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో ఎక్కడ చూసినా చెత్తాచెదారంతో దర్శనమిస్తుంది. సేదా తీరేందుకు నీడ కూడా లేకపోవడంతో పార్కుకు రావడానికి పెద్దగా ఆసక్తి చూపడం లేదు. చీకటి పడితే చాలు పార్కులో ఏమి జరుగుతుందో ఎవరికి తెలియని పరిస్థితి. పార్కు అపరిశుభ్రంగా ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారు.



నిరుపయోగంగా మారిన బోరు

నీటి వసతి లేక..

హెచ్ఏఎల్ పార్కులో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసి ఊరించిన అధికారులు కనీస సౌకర్యాలు మర్చిపోయారు. ముఖ్యంగా పార్కుకు వచ్చే ప్రజలకు తాగడానికి మంచినీరు లేదు. పార్కులో ఏర్పాటు చేసిన బాత్‌రూమ్‌లకు నీటి సౌకర్యం లేక కంపు కొడుతున్నాయి. నీళ్లు లేక మొక్కలు ఎండి పోతున్నాయి. పార్కు అందుబాటులో ఉన్నప్పటికీ కనీస సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆట వస్తువులకు మరమ్మతులేవి?

పార్కులో గత మూడేళ్ల క్రితం పిల్లల కోసం ఆట వస్తువులు ఏర్పాటు చేశారు. అవి ప్రస్తుతం విరిగిపోయి నిరుపయోగంగా మారాయి. వాష్‌బేషన్ విరిగి అపరిశుభ్రంగా మారింది. బోరు సౌకర్యం ఉన్నా మోటార్లు లేక నీటి కటకటతో పార్కు ఏడారిగా దర్శనమిస్తుంది. ఉన్న ఒక్క మోటారు వేరే డివిజన్‌లో ఉన్న పార్కులో వేసిన బోరుకు మోటార్‌ను టెస్టింగ్ కోసం తీసుకెళ్లి ఇప్పటి వరకు తెచ్చి బిగించలేదు. పార్కులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కులో వసతులు కల్పించి అందరికీ ఉపయోగంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

అభివృద్ధి చేయకుండా

డబ్బు వసూళ్లా?

- వాకర్స్ వద్ద డబ్బు వసూలు సిగ్గుచేటు
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



పార్కును పరిశీలించి స్థానికులతో కలిసి అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కేపీహెచ్‌బీకాలనీ: పార్కులు, ఆట స్థలాలను అభివృద్ధి చేయాల్సిన ప్రభుత్వం వాకింగ్ కోసం వచ్చే వారి నుంచి డబ్బులు వసూలు చేయటం సిగ్గుచేటని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేపీహెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని పార్కులు, ఆట స్థలాలను కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మలేషియా టౌన్‌షిప్ పక్కన ఉన్న క్రికెట్ మైదానంతో పాటు ఇతర పార్కులలో గత ప్రభుత్వం హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులు మినహా కొత్తగా ఎలాంటి నిధుల కేటాయింపు జరగలేదన్నారు. డబ్బులు వసూలు చేస్తున్న కాంట్రాక్టర్‌ను అధికారుల సమక్షంలో పిలిచి ఇక నుంచి వసూలు చేయవద్దని ఆదేశించారు. 5వ ఫేజ్‌లో టెన్నిస్ కోర్టులో క్రీడాకారుల వద్ద డబ్బులు వసూలు చేయడంతో పాటు పక్కనే ఉన్న స్కూల్ నుంచి కూడా డబ్బులు తీసుకొని ఆడుకోవటానికి కేటాయిస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో జీహెచ్ఎంసీ అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. గత పాలనలో కోట్లాది రూపాయలు వెచ్చించి పార్కులు, ఆట స్థలాలను అభివృద్ధి చేశామన్నారు. అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, పార్కులు, ఆట స్థలాల నిర్వహణను మరిచి డబ్బులు వసూలు చేయడంపై దృష్టి పెట్టడం సరికాదన్నారు. 4, 5, 6, 7, 9వ ఫేజ్‌లతో పాటు అన్ని పార్కులు, ఆట స్థలాలను సక్రమంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఈఈ శ్రీనివాస్, డీఈ శంకర్, ఏఈ సాయిప్రసాద్, హార్టికల్చర్ విభాగం అధికారులు పద్మనాభయ్య, విజయరాణి, సమత, క్రీడా విభాగం అధికారులు వీరానంద్, హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారి శ్రీకాంత్, నాయకులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పించిన ఎమ్మెల్యే

మోతీనగర్: మూసాపేట డివిజన్ కబీర్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జి. జోసెఫ్ మాతృమూర్తి కరుణమ్మ శుక్రవారం ఉదయం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, మాజీ కౌన్సిలర్ సీ.హెచ్. సత్యనారాయణ తదితరులతో కలిసి కరుణమ్మ మృతదేహంపై పూలమాలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు నాగుల సత్యం, మూసాపేట డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తన్నీరు తిరుపతిరావు, ఎంపీఏ మాజీ అధ్యక్షులు నల మాల్పు అంజిరెడ్డి, వివిధ పార్టీల నాయకులు కంచర్ల శ్రీనివాస రావు, రాజ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎమ్మెల్యే కృష్ణారావు పర్యటన

మోతీనగర్: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అల్లాపూర్ డివిజన్‌లోని పలు పార్కులు, క్రీడా స్థలాలను ఆదివారం పరిశీలించనున్నట్లు కార్పొరేటర్ సబిహా బేగం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గాయత్రినగర్‌లోని ఇండోర్ షటిల్ కోర్టు స్టేడియం, రాక్ గార్డెన్, సున్నం చెరువు పార్కు, వాటర్ ట్యాంక్ పార్కు, ఉమెన్స్ పార్కు, ఆర్కే సొసైటీలోని అబ్దుల్ కలాం పార్కు, రాజీవ్ గాంధీ నగర్‌లోని బస్తీ దవాఖానాలను పరిశీలించనున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈఓ విజయకుమారి

- డీఈఓ విజయకుమారి
- నూతన ఉపాధ్యాయులకు మూడు రోజుల శిక్షణ

కూకట్‌పల్లి: మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించాలని డీఈఓ విజయకుమారి అన్నారు. శుక్రవారం కూకట్‌పల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డీఎస్సీ నూతన ఉపాధ్యాయులకు మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. వృత్తి పట్ల నిబద్ధత ఉండాలన్నారు. జిల్లాలో ఇప్పటికే అనేక రకాల సృజనాత్మకతతో కూడిన ఎన్నో వినూత్న కార్యక్రమాలను విద్యాశాఖ ప్రారంభించి అమలు చేస్తుందని వివరించారు. వాటిని పుణికి పుచ్చుకొని వృత్తిలో రాణించాలన్నారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి ఎంఈఓ కిషన్, ఏఎంఓ రవీందర్ రాజు, ప్రధానోపాధ్యాయులు నరేందర్ రెడ్డి, కోర్సు డీఆర్‌పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బి2బీ ఎక్స్‌పో–2025

ఎస్కీ'లో విమెన్ ఇంటర్నేషనల్ సమ్మిట్ ఆన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్





చందానగర్/రాయదుర్గం: మహిళల ఎక్స్‌పో–2025 అందరినీ ఆకట్టుకుంది. మహిళా వ్యాపారులకు కొత్త అవకాశాలు అందించడమే లక్ష్యంగా కాన్ఫడరేషన్ ఆఫ్ విమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ (సీఓడబ్ల్యూఈ) ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మక విమెన్ ఇంటర్నేషనల్ సమ్మిట్ ఆన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా కన్వెన్షన్ సెంటర్‌లో బి2బీ ఎక్స్‌పో–2025ను ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో మహిళలు, ఇతరులు ఈ ఎక్స్‌పోను తిలకించారు. మహిళా వ్యాపారవేత్తలు తమ ఉత్పత్తులు, సేవలు ప్రదర్శించేందుకే ఈ ఎక్స్‌పోను నిర్వహించారు. పలు సంస్థలు, సాఫ్ట్‌వేర్ కంపెనీలు, ప్రధాన సంస్థలు, 40పైగా కొనుగోలు సంస్థలు, 70 మంది విక్రేతలు పాల్గొన్నారు. ఈ ఎక్స్‌పోలో మహిళా వ్యాపారవేత్తలు పర్యావరణహిత బ్యాగులు, సాంకేతిక వస్తువులు తదితరాలను ప్రదర్శించారు. తెలంగాణ, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్, హర్యానా వంటి రాష్ట్రాలలో సీఓడబ్ల్యూఈ విస్తరించి ఉంది.

కూలిన భారీ వృక్షం



ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ కల్యాణ్ థియేటర్ సమీపంలోని శాంతినికేతన్ ప్రధాన రహదారిలో భారీ వృక్షం శుక్రవారం ఒక్కసారిగా నేల కూలింది. దీంతో వాహనదారులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. ఆ సమయంలో అటు వైపు రాకపోకలు సాగించకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పిందని చెప్పవచ్చు. విషయం తెలుసుకున్న జీహెచ్ఎంసీ, పోలీసులు అక్కడకు చేరుకున్నారు. వృక్షాన్ని తొలగించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు.

పాఠశాల వార్షిక వేడుకలు



సాంస్కృతిక ప్రదర్శనలో చిన్నారులు

మూసాపేట: మూసాపేటలోని కిడ్డీ మౌంట్ లిటేర స్కూల్‌లో శుక్రవారం పాఠశాల వార్షిక వేడుకలు నిర్వహించారు. భక్తి, సినిమా పాటలకు అనుగుణంగా విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. సెల్ వాడకంతో చిన్నారులు నష్టపోతున్నారని, సేవ్ వాటర్ గురించి చేసిన నృత్యాలు ఆలోచింపజేశాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ మహేందర్, బాలాజీనగర్ కార్పొరేటర్ పగడాల శిరీష హాజరయ్యారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ చిన్నారావు, ప్రిన్సిపాల్ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్

- ఘనంగా పాఠశాలల్లో సైన్స్ డే
- నమూనాలను ప్రదర్శించిన విద్యార్థులు
- ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేత



కూకట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన జాతీయ సైన్స్ వేడుకలో మేడ్చల్ ఏఎంఓ రవీందర్ రాజు, హెచ్ఎం నరేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు

కూకట్‌పల్లి: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. హెచ్ఎం సి. నరేందర్ రెడ్డి అధ్యక్షతన కార్యక్రమానికి మేడ్చల్ ఏఎంఓ రవీందర్ రాజు ముఖ్య అతిథిగా హాజరై సైన్స్ గురించి వివరించారు. శాస్త్రవేత్తల గురించి వివరించి, వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. నమూనాలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు నజీముద్దీన్, మల్లారెడ్డి, ప్రవీణ్‌కుమార్, సత్యనారాయణ రెడ్డి, ఉమా వసుంధర, ముంతాజ్‌బేగం, రమ్య సారిక పాల్గొన్నారు.

కిమ్సన్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఆధ్వర్యంలో..

కిమ్సన్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ అయిన సుచిత్రలోని సెయింట్ ఆండ్రూస్ హైస్కూల్, అల్వాల్‌లోని సెయింట్ మైఖేల్ స్కూల్ విద్యార్థులు కూకట్‌పల్లి అశోక వన్ మాల్‌లో సైన్స్ ఫెయిర్‌ను నిర్వహించారు. మాయిశ్చర్ సెన్సార్ డ్రిప్ ఇరిగేషన్ సిస్టం, ఎల్‌పీజీ లీకేజ్ డిటెక్టర్, రైల్వే స్టేషన్‌లో స్మార్ట్ పవర్ కంట్రోలర్, ఆర్ఎఫ్ఐడీని ఉపయోగించే స్మార్ట్ మెడిసిన్ బాక్స్, మినీ రోబో, 3డీ ప్రింటింగ్ మెషిన్ వంటి అనేక ప్రాజెక్టులను ప్రదర్శించారు. కార్యక్రమంలో అశోక డెవలపర్స్ అండ్ బిల్డర్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ జైదీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచశీల స్కూల్‌లో..

మూసాపేట: మూసాపేటలోని పంచశీల స్కూల్‌లో జాతీయ విజ్ఞాన దినాన్ని నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభించారు. సోలార్ వరల్డ్, పల్లెటూరు వాతావరణం ఉట్టిపడేలా గోమాత ప్రాధాన్యతను తెలియజేస్తూ చేసిన ఆకృతులు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలుర ప్రభుత్వ పాఠశాలలో..

మూసాపేటలోని బాలుర ప్రభుత్వ పాఠశాలలో సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హెచ్ఎం అరిఫ్ ఖాన్, బీజేపీ డివిజన్ ఉపాధ్యక్షులు ప్రశాంత్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.



అశోక వన్‌మాల్‌లో జరిగిన సైన్స్ ఫెయిర్‌లో పాల్గొన్న విద్యార్థులు, కస్టమర్లు



మూసాపేటలోని పంచశీల స్కూల్‌లో ..

హత్య కేసులో నలుగురు యువకుల రిమాండ్

- కలిసి మద్యం సేవించి ఆపై హత్య

మోతీనగర్: అల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పాతకక్షల కారణంగా ఓ యువకుడిని మరో నలుగురు యువకులు కలిసి హత్య చేశారు. వారిని అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. సీఐ సామల వెంకట రెడ్డి వివరాల ప్రకారం.. మూసాపేట డివిజన్, కబీర్‌నగర్‌కు చెందిన భానుప్రకాష్ (26) అల్లాపూర్ డివిజన్‌లోని శివాజీనగర్‌కు చెందిన రాకేష్‌తో 2017 నుంచి ఒక కేసు విషయంలో ఇరువురి మధ్య బేదాభిప్రాయాలు ఉన్నాయి. ఈ విషయమై అనేక సార్లు గొడవ పడ్డారు. దీంతో రాకేష్ భాను ప్రకాష్‌పై కక్ష పెంచుకుని అంతమొందించాలని అనుకున్నాడు. అందుకు సరైన సమయం కోసం వేచి చూస్తున్నాడు. ఈ నెల 25న అర్ధరాత్రి సుమారు 2.30 గంటల సమయంలో శివాజీ నగర్ గ్లాస్ ఫ్యాక్టరీ టర్నింగ్ పాయింట్ వద్ద రాకేష్, శివకుమార్, రాహుల్, రాజేష్, భాను ప్రకాష్‌లు మద్యం సేవించారు. అనంతరం భానుప్రకాష్‌తో మిగతా నలుగురు కలిసి గొడవపడ్డారు. అతడిని గొడ్డలి, సిమెంట్ ఇటుకలతో కొట్టి చంపి వారు పరారయ్యారు. అల్లాపూర్ పోలీసులు బృందాలుగా ఏర్పడి కొత్తూరు సీతయ్య నగర్‌లోని రాజేష్ ఇంట్లో ఉన్నటువంటి శివకుమార్, రాహుల్‌లను, శివాజీ నగర్‌లో రాకేష్‌ను ఆయన నివాసంలో శుక్రవారం అల్లాపూర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి హత్యకు ఉపయోగించిన వస్తువులను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. నిందితులను చాకచక్యంగా అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించిన సీఐ సామల వెంకట రెడ్డి, పోలీసులను డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కె. సురేష్, కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస్‌రావు అభినందించారు.